క్లుప్తంగా

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



చిల్లకూరు: క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ వైద్య ఖర్చులకు కూడా ఆర్థిక స్థోమత లేని ఓ మహిళకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అండగా ఉండేందుకు ముందుకు వచ్చి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని బాధితురాలికి సోమవారం అందించారు. మండలంలోని కోట క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న నక్కల కాలువ కండ్రిగలో నివశించే అన్నం లక్ష్మమ్మ అనే మహిళ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతోంది. ఈమె వైద్యం చేయించుకునేందుకు కూడా ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని స్థానికులు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత శ్రీనివాసులుకు తెలియజేశారు. దీంతో ఆయన ట్రస్టు ప్రతినిధుల ద్వారా ఆమెకు ఇంటి వద్దకు వెళ్లి ఆర్థిక సాయం అందించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ట్రస్టు ప్రతినిధులు బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి



రాపూరులో యూటీఎఫ్ ర్యాలీ

రాపూరు: యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జనవరి 5నుంచి 8వరకు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవాల సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషులు, ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ పిలుపు నిచ్చారు. రాపూరులో సోమవారం ప్రచారజాత బృందానికి స్థానిక ఉపాధ్యాయులు స్వాగతం పలికి యూటీఎఫ్ భవనం వద్ద పతాకావిష్కరణ, ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు బాలు, హరి ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు, పార్వతీశం, సుబ్రమణ్యం, నాదానందం, వెంకటేశ్వర్లు, రవికాంత్, ప్రసాద్, సుందరయ్య, సౌభాగ్యవతి, అరుణ, సుప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వామ పక్షాల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

గూడూరు రూరల్: కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు కోరుతూ పదవికి రాజీనామా చేయాలని వామ పక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సీపీఎం, సీపీఐతోపాటుగా పలు ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు జోగి శివకుమార్, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్, బీవీ రమణయ్య, ముత్యాలయ్య, సీపీఐ నాయకులు సీహెచ్ ప్రభాకర్, శశికుమార్, కాలేషా, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వసతుల కల్పన



సమావేశంలో పాల్గొన్న బలిజ మహిళలు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని బలిజ మహిళా సంక్షేమ సంఘం వచ్చే ఏడాది బలిజ పేద విద్యార్థుల అభ్యున్నతికి వసతులు కల్పించేలా సోమవారం తీర్మానం చేసింది. పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఉన్న సంస్థ కార్యాలయంలో బలిజ మహిళా సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ మాట్లాడుతూ బలిజలకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి సువర్ణలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, అరుణ, ఉషా, రాధ, సుప్రజ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంటి వద్ద అర్ధరాత్రి రభస

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి ఇంటి వద్ద సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కుమార్, శేఖర్, చెంచయ్య అను ముగ్గురు యువకులు మద్యం మత్తులో దుర్భాలాడుతూ రభస చేసిన ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూటుగా మద్యం సేవించిన ముగ్గురు యువకులు సర్పంచ్ ఇంటి వద్దకు చేరుకుని దుర్భాషలాడారు. దాంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడ నుంచి పలాయనం చిత్తగించారు. ఎస్‌ఐ నాగరాజు గ్రామానికి చేరుకుని వివాదాలు తలెత్తకుండా భద్రతా పరమైన చర్యలు చేపట్టారు. చట్టాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకం. వీటి ఫలితాలపైనే వారి భవిత ఆధారపడి ఉంటుంది. దీంతో అటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ పరీక్షకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శనివారం, ఆదివారాల్లో సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు



పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్

పదికి ప్రత్యేకం

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహణ
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

దక్కిలి: . డిసెంబర్ 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు మిగిలిన వారు ఉత్తమ మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పెరగడంతోపాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక దోహదపడుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

దక్కిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నెల నుంచి మార్చి వరకు వంద రోజులు ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 17 నుంచి మార్చి 31 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. మండలంలోని దక్కిలి, డి.వడ్డిపల్లి, వడ్ల మోపూరు, పాతనాలపాడు (కమ్మవారిపల్లి), దగ్గవోలు, తీర్థంపాడు, దక్కిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 329 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేలా ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు.



పదో తరగతి విద్యార్థులకు బోధన

అదనపు తరగతులు నిర్వహణ

వంద రోజులు ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలు వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతి ఒక్కరూ నలుగురు నుంచి ఆరుగురు విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు.. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మ విశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పదోతరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. విద్యాశాఖ అందించిన 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తునూ సెలవు దినాల్లోనూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిన వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం.

– భాస్కర్, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్ దగ్గవోలు

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. మా అభ్యున్నతికి ఉపాధ్యాయులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్టడీ అవర్స్ పబ్లిక్ పరీక్షలకు ఎంతో ఉపయుక్తగా ఉంటాయని నమ్ముతున్నాం. మంచి మార్కులు తెచ్చుకుంటాం

– పి.హర్షవర్ధన్, పదో తరగతి

ప్రణాళిక ప్రకారం తరగతులు



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మాకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. వారు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చదువుకుంటున్నాను.

– కె.మోక్షిత, పదో తరగతి

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

సైదాపురం: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ అనురాధ అన్నారు. మండలంలోని పాలూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు ద్వారా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల వద్ద నుంచి అధిక సమస్యలపై అర్జీలు స్వీకరించినట్టు డీటీ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ రఘు తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు మేపారని ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామానికి చెందిన మల్లెమాల మల్లికార్జున్‌రెడ్డికి సంబంధించిన వరిపైరును అదే గ్రామానికి చెందిన బత్తెయ్య పశువులను వదిలి మేపించినట్లు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరిపైరు దెబ్బతినిందని, ఇప్పుడిప్పుడే ఎరువులు వేసి కాపాడుకుంటున్న తరుణంలో పశువులతో వరిపంటను ఇలా మేపించడంతో తనకు నష్టం వాటిల్లిందని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ఏఓ ప్రదీప్

కలువాయి: పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్‌ను నమోదు చేసుకోవాలని ఏఓ ప్రదీప్ వెల్లడించారు. కలువాయి వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుండి నష్టపరిహారం పొందవచ్చునని తెలియజేశారు. ఈ మేరకు రైతులు స్పందించి తమ సచివాలయాల్లో వ్యవసాయశాఖ అధికారుల ద్వారా పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా వేడుకలు చేసుకోవాలి

సైదాపురం: నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతోమాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

నేతన్నల సమస్యల పరిష్కారానికి చర్యలు

వెంకటగిరి(సైదాపురం): చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. పట్టణంలోని సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో సోమవారం ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు క్లస్టర్ల ద్వారా సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 170 మందికి మంజూరు కాగా 14వ వార్డులో 50 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. చేనేత కార్మికులు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

విశ్వోదయ స్థలాలు పరిరక్షించాలి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విశ్వోదయ స్థలాలు పరిరక్షించి జూనియర్ కళాశాలకు బదలాయించాలని పీడీఎస్‌ఓ పట్టణ నాయకుడు సీహెచ్ పవన్ తెలిపారు. పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో విశ్వోదయ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రం సమర్పించారు. స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, ఏఐవైఎఫ్ నాయకులు సాయికుమార్, పీడీఎస్‌ఓ నాయకులు హరిప్రసాద్, లీలామోహన్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌ఓ నిరసన

పైపులైన్లు తవ్వే ముందు జాగ్రత్తలు పాటించాలి

ఓజిలి: మండలంలో అత్తివరం, మేనకూరు సెజ్, నాయుడుపేట, గూడూరు పరిసర ప్రాంతాల్లో ఏజీ అండ్‌పీ గ్యాస్ పరిశ్రమ రోడ్డు ప్రక్కనే పైపులైను వేసి ఉండడంతో ప్రజలు ఎవ్వరైనా తవ్వకాలు జరిపే ముందు జాగ్రత్తలు పాటించాలని పరిశ్రమ యజమాన్యం ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. గ్రామస్తులు కొంత మంది రోడ్డు పక్కన తవ్వకాలు జరిపి గ్యాస్ పైపులైన్లను ధ్వంసం చేస్తున్నారన్నారు. గ్యాస్ పైపులైన్లు ధ్వంసం చేసే సమయంలో గ్యాస్‌లీకై ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టంతోపాటుగా ఆస్తి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. పైపులైన్లు ధ్వంసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పైపులైన్లను తవ్వేముందు పరిశ్రమ యాజమాన్యానికి సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఏజీఅండ్‌పీ పరిశ్రమ అత్యవసరానికి 1800 2022 999 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ఓజిలిలోని ఏజీఅండ్‌పీ గ్యాస్ స్టేషన్

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి



దిగువచావలి గ్రామంలో గ్రామసభలో పాల్గొన్న అధికారులు

ఓజిలి: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు నిర్వహిస్తోందని తహసీల్దార్ పద్మావతి అన్నారు. మండలంలోని గుర్రంకొండ, కార్జీమేడు గ్రామాల్లో సోమవారం గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ భూసమస్యలు పరిష్కరించేందుకు చక్కటి మార్గమని తెలిపారు. అనంతరం గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మినారాయణ, వీఆర్ ఓ తిరుపాలయ్య, సర్పంచ్ మాధవీలత, మాజీ సర్పంచ్ కొండూరు సురేష్‌రాజు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలోని దిగువచావలి గ్రామంలో జరిగిన రెవెన్యూ గ్రామసభకు నాలుగు అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ రెడ్డి తెలిపారు. వన్‌బీ, అడంగల్ కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషిని బాయి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో తూతూమంత్రంగా..

దొరవారిసత్రం: మండలంలోని మావిళ్లపాడు, మేలుపాక గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులకు ఏ శాఖ అధికారులు హాజరు కాకపోవడంతో తూతూ మంత్రంగా నిర్వహించారు. కేవలం సచివాలయ సిబ్బంది మాత్రమే పాల్గొన్నారు.

కండలేరులో 57.228 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 57.228 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ ద్వారా 210 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 520, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అధికారులు సమయపాలన పాటించాలి

బాలాయపల్లి(సైదాపురం): మండల పరిధిలో ఉన్న అధికారులు సమయపాలన పాటించాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. బాలాయపల్లిలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుశాఖల అధికారులు ఆలస్యంగా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాయపల్లి–జయంపు, వెంకటగిరి–నిడిగల్లు మధ్య రోడ్డు గుంతల మయంగా ఉందని, వీటిని మరమ్మతులు చేపట్టాలని పలు సార్లుగా అధికారుల దృష్టికి తీసుకొచ్చిన పరిష్కారం కావడం లేదన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా శ్రద్ధ వహించాలని తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్ ఉద్యోగ సంఘ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

నాయుడుపేట టౌన్: పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయుడుపేట తాలుకా నేతలు 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఉద్యోగులు సంఘ జిల్లా కార్యదర్శి దేవ ప్రసన్నకుమార్, విశ్రాంత పరిపాలన అధికారి రవిబాబు, పరిపాలన అధికారి సీహెచ్ కుసుమాంబ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలి

సైదాపురం: సైన్స్ ఫలాలు సామాన్యులకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు పరికరాలను ఎంపీడీఓతో కలిసి ఎంఈఓలు దయాకర్‌రావు, సుప్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సైన్స్ ఫేర్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హెచ్‌ఎం వాసుదేవకుమార్ తదితరులున్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

– నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేటటౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రతలు పాటించాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. హెల్మెట్ ఆవశ్యకతపై సోమవారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో వైఎస్సార్ సర్కిల్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు హోంగార్డులకు, మహిళ పోలీసులకు డీఎస్పీ ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు హెల్మెట్లు ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఇతరులకు చెప్పాలని సూచించారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్లు, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. అనంతరం ఆయనతో నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు బాబీ, సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, స్వప్న, నాగరాజు, అజయ్‌కుమార్ సర్కిల్ పరిధిలోని పోలీసులు హెల్మెట్లు ధరించి యువతతో పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన పోలీసులు, పట్టణ యువత పాల్గొన్నారు.



పోలీసులకు హెల్మెట్లు అందజేస్తున్న డీఎస్పీ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చెంచుబాబు సూచించారు. అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ, సీఐ బాబీతో కలసి విలేకరులు సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఖాతాలో నగదు గల్లంతు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే సైబర్ పోలీసులకు సమాచారం అందించాలని, ముఖ్యంగా 1930 నంబరుకు ఫిర్యాదు చేస్తే అప్పటికప్పుడు స్పందిస్తారన్నారు. అలాగే నూతన సంవత్సర వేడుకలను సైతం పోలీసులు నిబంధనలు పాటించి ఎవరికీ ఇబ్బందులు లేకుండా జాగ్రత్త పాటించి జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు.

వేడుకగా ఆరాధనోత్సవాలు

నాయుడుపేటటౌన్: సద్గురు సంగీత త్యాగరాజ స్వామి వార్ల 62వ ఆరాధనోత్సవాలను నాయుడుపేటలో సోమవారం వేడుకగా జరుపుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో స్థానిక నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామివారి చిత్రపటాన్ని పూలతో ప్రత్యేక అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అలాగే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంబేడ్కర్ భవన్‌లో పోటాపోటీగా కచేరీ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.



త్యాగరాజస్వామి చిత్రపటంతో నగరోత్సవం

పొగమంచుతో ఇక్కట్లు

ఓజిలి: మండలంలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతున్నాయి. ఏకంగా 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలకే చలి ప్రారంభమై మంచు కురుస్తోంది. ఉదయం పది గంటలైనా చలి తగ్గకపోవడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచు తగ్గకపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. చలి నుంచి కొంతమేర ఉపశమనం పొందేందుకు చలి మంటలు వేసుకుంటున్నారు. పొగమంచు ఎక్కువగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.



జాతీయ రహదారిపై పొగమంచులో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనచోదకులు